ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత

గోల్కొండ: బోనాల వేడుకల్లో ఎటువంటి అపశృతులు దొర్లకుండా అన్ని శాఖల అధికారులు కృషి చేస్తున్నారని గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సి.వసంత అన్నారు. సోమవారం ఆమె గోల్కొండ కోటలో ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గత ఆదివారం జరిగిన నాలుగో బోనం పూజకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చారన్నారు. మహిళా భక్తులకు పోలీసులు చేసిన ఏర్పాట్లు ఎంతో బాగున్నాయన్నారు.

అర్చక ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడిదల చంద్రశేఖర్ మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి తనకు ఈ పదవి ఇచ్చిన జేఏసీ చైర్మన్ ఉపేంద్ర శర్మ, కన్వీనర్ రవీంద్రచార్యులు, అధ్యక్షుడు బద్రినాథ్, చంద్రశేఖర్ శర్మ, అర్చక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచార్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బుస్సా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దర్బార్ మైసమ్మ బోనాలకు భారీ ఏర్పాట్లు



అమర్ సింగ్

గోల్కొండ: కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలకు భారీ ఏర్పాట్లు చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్, రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు ఠాకూర్ అమర్ సింగ్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దర్బార్ మైసమ్మ ఆలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే పాతబస్తీ బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తామన్నారు. గ్రేటర్‌లోనే అతిపెద్ద తొట్టెలను పాతబస్తీ నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయం ముందు ప్రతిష్ఠించడం జరుగుతుందన్నారు.

పరామర్శ



సక్కుబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

గౌలిపురా: పాతబస్తీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.యశ్వంత్ కుమార్ మేరును జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. యశ్వంత్ కుమార్ తల్లి సక్కుబాయి ఇటీవల మరణించారనే విషయాన్ని తెలుసుకున్న కవిత సోమవారం లాల్ దర్వాజాలోని యశ్వంత్ కుమార్ నివాసానికి వచ్చి సక్కుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి సలావుద్దీన్ లోధి, జాగృతి నగర ఉపాధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణ, మణికొండ విజయ్ కుమార్, అంబడి రాజేశ్, వికాస్, పంకజ్ కుమార్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



సుల్తాన్‌బజార్: ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని బ్యాంకులు, ఇన్సూరెన్స్ రంగాలకు చెందిన దాదాపు లక్ష మంది ఉద్యోగులు పాల్గొననున్నట్లు ఉమ్మడి రాష్ట్రాల జాయింట్ ఫోరం ఆఫ్ ఫైనాన్షియల్ సెక్టార్ యూనియన్స్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం కోఠిలోని (ఏపీటీబీఇఎఫ్) రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివిధ యూనియన్ నాయకులు బి.ఎస్.రాంబాబు, సమద్ ఖాన్, ఫణికుమార్, ఎస్.రవీంద్రనాథ్, సతీష్, తిరుపతయ్య తదితరులు మాట్లాడారు. బ్యాంకింగ్ ఇన్సురెన్స్ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇప్పటికైనా ఈ విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు.

డంపింగ్ యార్డుతో పరేషాన్

- జియాగూడలో పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- పురానాపూల్ నుంచి గిర్కపల్లి వరకు అధ్వానంగా రహదారి
- ఇక్కడే చెత్త, ప్లాస్టిక్ వ్యాపారాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారిలో పేరుకుపోతున్న చెత్తాచెదారం

జియాగూడ: జియాగూడ జాతీయ రహదారిలో ఏర్పాటైనా డంపింగ్ యార్డ్ మొదట్లో కేవలం జియాగూడ, కార్వాన్‌లకు చెందిన స్వచ్ఛ్ ట్రక్కుల చెత్తను డంప్ చేసిన వెంటనే భారీ వాహనాల్లో తరలించే వారు. మొదట్లో 150 వరకు స్వచ్ఛ్ ట్రక్కుల చెత్త మాత్రమే డంప్ అయ్యేది. ప్రస్తుతం నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రతిరోజు 400లకు పైగా స్వచ్ఛ్ ట్రక్కుల చెత్త తెచ్చి ఇక్కడ పోస్తున్నారు. వాస్తవానికి ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే పని చేయాల్సిన డంపింగ్ యార్డు రాత్రి వరకు కొనసాగుతుంది.

అంతా చెత్తమయం..

డంపింగ్ యార్డు పరిసరాలు పూర్తిగా చెత్తమయంగా మారాయి. ముఖ్యంగా సమర్థ నారాయణ ఆశ్రమం, కేశవస్వామినగర్, గొల్లబస్తీ, నవోదయనగర్, న్యూ గంగానగర్, మేకలమండి, సత్యనారాయణనగర్, జియాగూడ 2జే బస్టాండ్ చౌరస్తా, భవానీనగర్ తదితర ప్రాంతాల బస్తీలవాసులు డంపింగ్ యార్డు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి ఇరుపక్కల ఉన్న ఈ బస్తీల వాసులు ఇళ్ల ముందు చెత్త ట్రక్కులు, టిప్పర్లు గంటల తరబడి చెత్తతో డంప్ చేయడానికి వేచి ఉంటాయి. గాలులు వీచిన ప్రతిసారి చెత్త గాలిలలో ఎగురుతూ ఇళ్లపైన పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త

చేతివాటంతో చెత్త ట్రక్కుల అనుమతి..

జియాగూడ డంపింగ్ యార్డుకు కేవలం జియాగూడ, కార్వాన్ ప్రాంతాల స్వచ్ఛ్ ఆటోలు, ట్రక్కుల చెత్తను డంపింగ్ యార్డులో వేయాల్సి ఉంటుంది. కానీ ఉదయం నుంచి రాత్రి వరకు వస్తున్న చెత్త ట్రక్కులు బుద్వేల్, షేక్‌పేట్, యూసుఫ్‌గూడ, బంజారాహిల్స్ తదితర ప్రాంతాలకు చెందిన చెత్తను కొంతమంది డబ్బులు తీసుకుంటూ పోయనిస్తున్నారు. ఇందుకు కారణం స్వచ్ఛ్ ఆటోలను నడిపేది జియాగూడకు చెందిన కార్మికులే. దీంతో పరిసర ప్రాంతాల వాసులకు చెత్త కారణంగా దోమల వ్యాప్తితో వ్యాధుల బారిన పడుతున్నారు.

చెత్తతో వ్యాపారాలు..

డంపింగ్‌యార్డు చుట్టుపక్కల చెత్తను ఏరివేస్తుంటారు. చెత్త ట్రక్కుల్లో వచ్చే చెత్తను వేరు చేసి అందులో నుంచి ప్లాస్టిక్, ఇనుము, అట్టాలు తదితరవి వేరు చేసి ఇక్కడే విక్రయాలు చేస్తుంటారు. ఇక్కడే అక్రమంగా కొనసాగుతున్న ప్లాస్టిక్ కార్ఖానాల్లో చూర చేస్తూ ఇతర రాష్ట్రాల్లోని కంపెనీలకు ప్లాస్టిక్ వస్తువుల తయారీకి భారీ వాహనాల్లో తరలిస్తుంటారు.


కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల విచారణ పూర్తి చేయాలి



ఏసీఎస్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న రాహుల్‌కుమార్

చార్మినార్: కొత్త రేషన్ కార్డు దరఖాస్తుల విచారణ వెంటనే పూర్తి చేయాలని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాహుల్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం చార్మినార్ సర్కిల్–3 ఏసీఎస్ఓ అస్లాం ఖాన్‌ను కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. ఇప్పటి వరకు 44,415 కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయని..ఇందులో 6,739 ఆమోదించబడాయని, 32092 ఇన్‌స్పెక్టర్ల వద్ద, 1204 తహసీల్దార్ వద్ద, 3802 డీసీఎస్ఓ వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ త్వరత్వరగా పూర్తి చేస్తామని ఏసీఎస్ఓ హామీ ఇచ్చారన్నారు. అలాగే ప్రస్తుత రేషన్ కార్డులలో చేర్పులు, మార్పుల కోసం 32,339 దరఖాస్తులు అందాయని, అందులో 16,942 ఆమోదించబడ్డాయని, మిగిలినవి పెండింగ్‌లో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారన్నారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మీర్ మహమ్మద్ అలీ, రామ్నాస్‌పురా డివిజన్ అధ్యక్షులు జాకేర్ హుస్సేన్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రాజేశ్వర్‌రావు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో కేంద్ర కమిటీ సర్వసభ్య సమావేశానిన నిర్వహించి ఏకగ్రీవంగా నూతన కమిటీని జాతీయ అధ్యక్షుడు కాటపల్లి రాజేశ్వర్‌రావు ప్రకటించారు. కేంద్ర కమిటీ అధ్యక్షుడిగా చెవ్వ కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా మిట్టపల్లి పోచయ్య, కె.భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా చెవ్వ శ్రీనివాస్, కోశాధికారిగా కాటపల్లి రవికుమార్‌లతో పాటు 15 మంది సభ్యులు ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జాతీయ కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం మాజీ అధ్యక్షుడు కాటపల్లి వీరస్వామి, ట్రస్టీ చైర్మన్ విజయ చందర్, మిట్టపల్లి కుమార్, రావుల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సినీ గేయ రచయితల 'స్వర వైభవం'



గాయకులను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: తొలితరం గీత రచయితలు సముద్రాల, మల్లాది, దేవులపల్లి, పింగళి..మలితరం గీత రచయితలు ఆరుద్ర, ఆచార్య, ఆత్రేయ, వేటూరి, సినారె, సిరివెన్నెల, చంద్రబోస్ రచించిన సినీ పాటలను కాకినాడ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో సినీగేయ రచయితల 'స్వర వైభవం' శీర్షికన వీనుల విందుగా కొనసాగింది. జీవిత భీమా సంస్థ సహకారంతో సుమారు 20 మంది గాయనీ గాయలు ఆ పాత మధురాలను ఆలపించి ఆహుతులను ఆకట్టుకున్నారు. కాకినాడ మ్యూజికల్ గ్రూప్ సంస్థ వ్యవస్థాపకుడు జి.ఎస్.జె.కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. తెలుగు సాహిత్య వైభవాన్ని చాటేందుకు సుప్రసిద్ధులైన 20 మంది గీత రచయితల పాటలను ఎంచుకుని ఆలపించినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో ఇతర గీత రచయితల పాటలను ఎంపిక చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్ నివేదిక సమర్పించగా జ్ఞానేశ్వర్ సభను సమన్వయం చేశారు. వ్యాఖ్యతగా గాంధీ వ్యవహరించారు.

అబాకస్ పోటీలో సత్తా చాటిన బుద్వేల్ విద్యార్థులు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

అబిడ్స్: అబాకస్ పోటీల్లో బుద్వేల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సత్తాచాటారు. తెలంగాణ ప్రాంతీయ స్థాయి సిప్ అబాకస్ పోటీల్లో బుద్వేల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని కోచింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ ప్రియాంక పవర్ వెల్లడించారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో 4వ తరగతి విద్యార్థి భార్గవర్ రామ్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించగా మరో ఆరుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారని ఆమె వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రియాంక పవర్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ చాటే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్య

విజయనగర్‌కాలనీ: యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం..మహ్మద్ తౌఫిక్ తన కుటుంబంతో కలిసి ఆసిఫ్‌నగర్ సాబేర్‌నగర్‌లో నివసిస్తూ వంట పని చేస్తాడు. ఇతని కుమారుడు మహ్మద్ దావూద్(20) గుడిమల్కాపూర్ పూలమార్కెట్‌లో పనిచేస్తాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు తన బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు స్థానికులు సహాయంతో కిందికి దించి పరీక్షించగా అప్పటికే అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఆసిఫ్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆలయానికి విరాళం



జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర

గౌలిపురా: మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయానికి విరాళంగా గౌలిపురాకు చెందిన జైహింద్ హోటల్ యజమాని కూచ జానకీరామ్ ముదిరాజ్ కుమారుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కుటుంబసభ్యులు రూ.50,001లను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్, గంగపుత్ర ఆలయ ముఖ్య సలహాదారులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లి మధుసూదన్ గిరి, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్, కోశాధికారి బొడ్డు సాయిబాబా, సదానంద్, ఎం.వినోద్, చందు గౌడ్, మహేందర్ గిరి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌నాయక్

గోల్కొండ: నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని టోలిచౌకీ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ అన్నారు. అజీజ్‌బాగ్‌లోని పోలీస్‌స్టేషన్‌లో రెస్టారెంట్లు, షాపుల నిర్వాహకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హోటల్స్, పాన్ డబ్బాలు ఉదయం 5 నుంచి తెల్లవారు జాము ఒంటి గంట వరకు తెరిచి ఉంచుకోవచ్చునన్నారు. ఇతర షాపుల వారు కచ్చితంగా రాత్రి 11 గంటల వరకు తమ తమ షాపులు మూసీ వేయాల్సిందే అని ఆయన స్పష్టం చేశారు. వ్యాపారులు నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బాల్‌రాజ్, రెస్టారెంట్ల యజమానులు, షాపుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి రిమాండ్

గోల్కొండ: దొంగతానాలకు పాల్పడుతున్న పాత నేతస్తుడిని రిమాండ్‌కు తరలించారు.సోమవారం గొల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ వివరాలు వెల్లడించారు. అబిడ్స్ కట్టేల మండీకి చెందిన మహ్మద్ ముజాహిద్ ఖురేషి(31) నాంపల్లిలోని ఓ షాపులో పని చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు ఇటీవల చోరీలకు పాల్పడుతుండగా వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. మహారాష్ట్రాలో సైతం మహ్మద్ ముజాయిద్ ఖురేషీపై కేసు నమోదై ఉంది. ఈ నెల 1న నయాకీలా గోల్కొండకు చెందిన అమీర్ ఖాతూన్ ఇంట్లో 70 వేల నగదుతో పాటు కొన్ని బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నెల 7న గోల్కొండ జమాలిదర్వాజా అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ ముజాయిద్ ఖురేషీ అదుపులోకి తీసుకుని విచారించగా పాత నేరస్తుడిగా తేలింది. నయాకీలాలో దొంగతనానికి పాల్పడింది తానే అని అంగీకరించడంతో రూ.70 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ జాయింట్ కమిషనర్ డి.శంకర్ సింగ్ అన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న ఆధ్వర్యంలో చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్ నగర్ సర్కిల్‌కి చెందిన బర్త్, డెత్ సర్టిఫికెట్, అక్రమ నిర్మాణం సమస్యలపై 2, చాంద్రాయణగుట్ట సర్కిల్‌లోని గుంతల రోడ్ల సమస్యపై ఒకటి, లాల్‌దర్వాజ మెయిన్ రోడ్డులో వీధి దీపాల సమస్యపై ఒక ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ విభాగం జోనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, ఎలక్ట్రికల్ స్ట్రీట్ లైట్స్ ఈఈ రామారావు, టౌన్ ప్లానింగ్ ఏసీపీలు రాందాస్, మెహ్రా, వెటిర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



వేడుకల్లో గాజుల అంజయ్య, రాకేష్ తివారి, పుస్తే శ్రీకాంత్

చార్మినార్: ఆశాడి త్రిరాత్రి ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రుక్మిణి సమేత విఠలేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పురానాపూల్ గల్లివీధిలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో అభిజిత్ లగ్నం మహోత్సవంలో రుక్మిణి సమేత విఠలేశ్వర స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ పుస్తే శ్రీకాంత్, అధ్యక్షుడు విష్ణుగౌడ్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, సుల్తాన్ షాహి జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేష్ తివారి తదితరులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

వరద నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



పూడికతీత పనులు చేస్తున్న మాన్సూన్ ప్రత్యేక బృందం సిబ్బంది

యాకుత్‌పురా: లోతట్టు ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు తలెత్తకుండా జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు మ్యాన్‌హోల్, నాలా పూడికతీత పనులు చేపట్టారు. సర్కిల్ పరిధిలోని యాకుత్‌పురా, ఎస్ఆర్టీ కాలనీ, మదీనానగర్, బడాబజార్, గంగానగర్ నాలా, రెయిన్‌బజార్, యశ్రబ్‌నగర్, తలాబ్‌కట్టా, భవానీనగర్, నషేమన్ నగర్, అమన్ నగర్, చాచా గ్యారేజ్ తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులు కొనసాగిస్తున్నారు. చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న ఆదేశాల మేరకు ముంపు ప్రాంతాల్లో వరద నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటికే డివిజన్ల వారీగా ప్రత్యేక మాన్సూన్ ప్రత్యేక వాహన బృందాలను ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

గోల్కొండ: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ అన్నారు. సోమవారం హిందు, ముస్లింల ఐక్యతను చాటిచెప్పిన బోనాలు విజయవంతమైన సందర్భంగా బి.శ్రీకాంత్‌చారిని సన్మానించారు. ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..శ్రీకాంత్‌చారి లాంటి యువకులు స్థానికుల మధ్య స్నేహ సంబంధాలను ప్రతిష్ఠపరిచేందుకు చేస్తున్న కృషి అందరికీ ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ హిస్టరీ గైడ్స్ అసోసియేషన్ ప్రతినిధి మహ్మద్ యూనుస్, వీర్‌సింగ్, శ్రీనివాస్, మహ్మద్ తదితరులున్నారు.



శ్రీకాంత్‌చారిని సన్మానిస్తున్న మిర్జా ఎక్బాల్ అహ్మద్ తదితరులు

ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు సన్మానం

అఫ్జల్‌గంజ్: బహదూర్‌పురా ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఆర్టీఏ యాక్టివిస్ట్ అజిత్ హిందుజ, డీసీటీఓ రవీందర్ ఘనంగా సన్మానించారు. గోషామహల్‌కు చెందిన వారు ఆయనను మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఏ యాక్టివిస్ట్ అజిత్ హిందుజ, డీసీటీఓ రవీందర్ మాట్లాడుతూ..సమాజంలో పోలీసుల పాత్ర ఎంతో ముఖ్యమైనదన్నారు. 24 గంటల పాటు ప్రజా సేవ చేస్తున్న పోలీసుల సేవలు అమోఘమన్నారు.



ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న ఆర్టీఏ యాక్టివిస్ట్ అజిత్ హిందుజ, డీసీటీఓ రవీందర్

రాంచందర్‌రావుకు సత్కారం



జియాగూడ: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రాంచందర్ రావు ఆధ్వర్యంలో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంటుందని బీజేపీ ఓబీసీ మోర్చా నేషనల్ మెంబర్ పెరిక సురేష్ అన్నారు. సోమవారం సురేష్ ఆధ్వర్యంలో ఓబీసీ నేతలు రాంచందర్‌రావును రాష్ట్ర కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి యువజన నాయకుడిగా, ఎమ్మెల్సీగా, బీజేపీ రాష్ట్ర నేతగా, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా, నేషనల్ బార్ కౌన్సిల్ మెంబర్‌గా నాలుగు దశాబ్దాలు విశేష అనుభవం కలిగిన రాంచందర్‌రావుకు పార్టీ పగ్గాలు అప్పగించడంతో ఆయన సారథ్యంలో పార్టీ బలోపేతం కాగలదని సురేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఘనంగా విఠలేశ్వర స్వామి కల్యాణం



వేడుకల్లో ఆనంద్‌కుమార్ గౌడ్, కోళ్ల ప్రదీప్‌రాజ్

అబిడ్స్: విఠలేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పురానాపూల్‌లో జరిగిన ఈ వేడుకల్లో గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, బేగంబజార్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కోళ్ల ప్రదీప్‌రాజ్, శివశంకర్ శర్మ, రామన్‌లాల్ యాదవ్‌లు పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు.

మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



చాంద్రాయణగుట్ట: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు ఆడాల శివ కుమార్ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. 30 ఏళ్ల పాటు అలుపెరగని పోరాటం చేసిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కుతుందన్నారు.